ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



యాదాద్రి భువనగిరి

3

బుధవారం 12 జూన్ 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ : 18004251442

యాదాద్రి : 1800 425 7106

సూర్యాపేట : 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.174	270	300
సూర్యాపేట	రూ.180	250	270
నల్లగొండ	రూ.172	240	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.0 కనిష్ఠం 24.8



బడికి వేళాయె

పాఠశాలలు నేటి నుంచి పునఃప్రారంభం కానున్నాయి. పిల్లలు వేసవి సెలవులు, ఆటలకు స్వస్తిపలికి బడిబాట పట్టనున్నారు. పిల్లలను బడికి పంపేందుకు తల్లిదండ్రులు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫాంను సిద్ధం చేశారు. స్కూళ్లు పునఃప్రారంభం నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు బడులను సిద్ధం చేశాయి. జిల్లాలో మొత్తం 712 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రాథమిక పాఠశాలలు 481,ప్రాథమికోన్నత పాఠశాలలు 68, ఉన్నత పాఠశాలలు 163 వరకు ఉన్నాయి.

- (ఆంధ్రజ్యోతి,యాదాద్రి)

- నేటి నుంచి పాఠశాలలు ప్రారంభం
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి బడిబాట
- ఈ ఏడాది నుంచి ప్రాథమిక పాఠశాలల్లో ఆంగ్ల బోధన
- మౌలిక వసతుల కల్పనకు రూ.25కోట్లు
- జిల్లాలో 665మంది ఉపాధ్యాయుల కొరత

జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవు. దీంతో ఈ ఏడాది విద్యా సంవత్సరంలో పాఠశాలల ప్రారంభానికి ముందే మౌలిక సదుపాయాల కల్పనపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించింది. ఫర్నీచర్, తాగు నీరు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి వసతులు కల్పించేందుకు 'అమ్మ ఆదర్శ' కమిటీల ద్వారా పలు పాఠశాలల్లో పనులు చేపట్టారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకూ విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గుతుండటం, మధ్యలోనే చదువు మానేసి వెళ్తున్న వారు కూడా ఉంటుండటంతో విద్యార్థుల నమోదుపై జిల్లా యంత్రాంగం ఈ సారి దృష్టి సారించింది. ప్రతీ పాఠశాలలో ప్రస్తుతం ఉన్న విద్యార్థుల సంఖ్యకు 10శాతం అదనంగా కొత్త అడ్మిషన్లు చేపట్టాలని లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను 10శాతానికి మించి పెంచిన ఉపాధ్యాయులకు, ప్రధానోపాధ్యాయులకు ప్రశంసపత్రాలు అందజేయనున్నారు. ఈ విద్యా సంవత్సరంలో 1వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించడంపై దృష్టి కేంద్రీకరించడంతోపాటు విద్యా ప్రమాణాలను పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ నిర్వహించనున్నారు.ఉత్తమంగా బోధనచేసే ఉపాధ్యాయులను ప్రోత్సహించేందుకు, మెరుగైన సేవలందించిన ఉపాధ్యాయులకు కలెక్టర్ నుంచి ప్రశంసాపత్రాలు అందజేసేందుకు విద్యాశాఖాధికారులు నిర్ణయించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజన పథకాన్ని పాఠశాలల్లో అమలు చేయనున్నారు. ఒకటినుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలు ప్రభుత్వం ద్వారా ముద్రితమైన పాఠ్యపుస్తకాలతోనే బోధించాలనే ఆదేశాలు ఉన్నాయి. ఈసారి 100శాతంమేర పాఠ్యపుస్తకాలు పాఠశాలలకు చేరాయి.

రూ.25కోట్లతో మరమ్మతులు

ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ఈ ఏడాది నిధులు రూ.25కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో 'అమ్మ ఆదర్శ' కమిటీల ద్వారా జిల్లాలోని అన్ని పాఠశాల్లో మరుగుదొడ్లు, నీటిసౌకర్యం, పైపులైన్లు ఏర్పాటుచేస్తున్నారు. ఇప్పటికే మరమ్మతు పనులు ప్రారంభం కాగా, ఈ నెలాఖరులోగా పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని అధికారులు చర్యలు తీసుకున్నారు.ఇప్పటికే పలు పాఠశాలల్లో పనులు చివరి దశలో ఉన్నాయి. ఎట్టి పరిస్థితుల్లో ఈనెల 30లోగా పూర్తి చేయాలని కమిటీలకు అధికారులు లక్ష్యం నిర్దేశించారు. ఇదిలా ఉండగా,జిల్లాలో మొత్తం 3,465 మంది ఉపాధ్యాయులు 2,800 మంది ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. ఇంకా 665 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వీటికి తోడు తాజాగా ప్రభుత్వం ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు షెడ్యూల్ జారీచేసింది.దీంతో మరిన్నిపోస్టులు ఖాళీ కానున్నాయి.

ప్రాథమికస్థాయి నుంచే ఆంగ్ల బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించే దిశగా ప్రభుత్వం ప్రాథమికస్థాయి నుంచే ఆంగ్లబోధనకు గతంలోనే శ్రీకారం చుట్టింది. వాస్తవానికి గ్రామీణ ప్రాంతాల్లో సైతం కూలీ పనిచేసుకునే వారు వారి పిల్లలను ఇంగ్లీష్ మీడియంలో చదివించేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకోసం స్తోమతకు మించి ఖర్చుచేసేందుకు వారు వెనుకాడడం లేదు. కష్టమైనప్పటికీ సమీపంలోని ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం స్కూళ్లలో పిల్లలను చేర్పిస్తున్నారు. ఉన్నత చదువుల సమయంలో ఇంగ్లీష్ కీలకం కావడంతో తల్లిదండ్రులు వారి పిల్లల భవిష్యత్తు దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటున్నారు. ఇంగ్లీష్ కోసం అందరూ క్రమేపీ ప్రైవేట్ స్కూళ్ల బాటపడుతుండటంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య ఏటా తగ్గుతోంది. నేపథ్యంలో ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే సర్కార్ బడుల్లో ఆంగ్లమాధ్యంలో బోధనకు ప్రభుత్వం గతంలోనే నిర్ణయం తీసుకుంది. అదేవిధంగా ఆంగ్లంలో బోధనకు ఇంగ్లీష్ మీడియం పుస్తకాలను సైతం పాఠశాలలకు అందజేశారు. పాఠశాలల ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతోపాటు ఒక యూనిఫాం అందజేయనున్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరుస్తాం



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరుస్తాం. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం రూ.25కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో పాఠశాల్లో మరమ్మతులు చేపట్టాం. జూన్ 30 నాటికి పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించనున్నాం. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో మెరుగైన ఫలితాలు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. జిల్లా వ్యాప్తంగా పాఠశాలలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించనున్నాం.

- డీఈవో కె.నారాయణరెడ్డి

- విద్యార్థుల తల్లిదండ్రులూ తస్మాత్ జాగ్రత్త
- బస్సుల కండీషన్, డ్రైవర్ల లైసెన్స్‌లను పరిశీలించాల్సిందే!



బడి బస్సు భద్రమేనా?

బడికి వేళ అయింది. ఉదయాన్నే చకచకా రెడీ అయిన చిన్నారులు భుజాన బ్యాగ్‌లు వేసుకొని, బస్సు కోసం రోడ్డుపైకి పరుగులు తీస్తుంటారు. బస్సు రాగానే ఎక్కి బడికి వెళతారు. అయితే ఈలోపు బస్సు ఆగిపోతే.. అందులోని చిన్నారులు, ఇంటివద్ద తల్లిదండ్రులకు టెన్షన్ తప్పదు. అందుకే పాఠశాలకు పంపే తల్లిదండ్రులు తప్పనిసరిగా చిన్నారుల బస్సులు, ఆటోలు కండీషన్‌లో ఉన్నాయా? లేవా? సరి చూసుకోవాలని విద్యావేత్తలు పేర్కొంటున్నారు.

- భువనగిరి రూరల్

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఉత్తమ విద్య అందించాలనే ఉద్దేశంతో ఫీజుల రూపంలో రూ.వేలు ఖర్చుచేసి ప్రైవేట్ పాఠశాలలకు పంపుతున్నారు. కేవలం చదువుపై మాత్రమే దృష్టి సారించకుండా పిల్లలు నిత్యం ఇంటి నుంచి పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగించే బడి బస్సుల సామర్థ్యం పైన దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వీరే కాకుండా విద్యాసంస్థల యాజమాన్యాలు వాటి నిర్వహణపై జాగ్రత్తలు తీసుకుంటే విద్యార్థుల ప్రయాణం సురక్షితమవుతుంది. ఈ నెల 12 నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు, రవాణా శాఖ కార్యాలయంలో ఈ నెల 15లోగా ఫిట్‌నెస్ పత్రాలు సమర్పించి సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి ఉంది. అయితే చాలా వరకు యాజమాన్యాలు అంతగా ఆసక్తి చూ పడంలేదు. విద్యార్థుల ప్రయాణ విషయంలో జాగ్రత్తలతో అన్ని పత్రాలు సమకూర్చుకొని ఫిట్‌నెస్ చేయించుకుంటేనే బస్సులు రోడ్లపైకి రావాలని రవాణా శాఖ అధికారులు ఆదేశాలు జారీ చేస్తున్నారు. జిల్లాలోని 17 మండలాలు, ఆరు మునిసిపాలిటీల పరిధిలో 274 స్కూల్ బస్సులు ఉండగా, అందులో ఇప్పటివరకు 130 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ నిర్వహించుకున్నారని, మిగతా 20 బస్సులు పూర్తిగా శిథిలావస్థకు చేరాయని ఇంకనూ 124 స్కూల్ బస్సులు ఫిట్‌నెస్ చేయించాల్సి ఉంది.

ఇవి తప్పనిసరి

- బస్సుల్లో ఏదేని అగ్ని ప్రమాదం సంభవిస్తే మంటలు ఆర్పేందుకు వీలుగా ఫైర్ ప్రొటెక్షన్ సిలిండర్ ఉండాలి.
- పాఠశాల, కళాశాలల బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించేందుకు వీలుగా డీటీవో కార్యాలయంలో అధికారులతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, బీమా పొల్యూషన్ పత్రాలు డ్రైవర్‌కు సంబంధించి లైసెన్స్ సమర్పించి పరీక్షలు చేసుకోవాల్సి ఉంటుంది.
- పాఠశాల, కళాశాల బస్సులు నడిపే డ్రైవర్ వయస్సు 60 ఏళ్లలోపు ఉండాలి.
- డ్రైవర్‌కు ఐదేళ్ల హెవీ వాహనం నడిపిన అనుభవం ఉండాలి.
- ప్రతీ పాఠశాల బస్సుకు సహ పాఠశాల యువకుడి (అటెండర్)ను నియమించుకోవాలి.
- బస్సులోని కిటికీలకు ఇరువైపులా నాలుగు వరుసలా పైపులను విద్యార్థులు తల, చేతులు బయటపెట్టి తొంగి చూడకుండా ఉండేలా అమర్చాలి.
- బస్సు కండీషన్‌లో ఉండడమే కాకుండా బ్రేక్ వేసిన సమయంలో నాలుగు వైపులా పార్కింగ్ లైట్లు వెలగాలి.
- చిన్న పిల్లలు ఎక్కేలా మెట్ల కింద భాగంలో మరో మెట్టు ఏర్పాటు చేసుకోవాలి.
- ప్రథమ చికిత్స బాక్సు అత్యవసర ద్వారాలు ఉండాలి.

ఫిట్‌నెస్ లేకుండా తిరిగితే బస్సులు సీజ్ చేస్తాం

పాఠశాలలు, కళాశాలలు పునర్‌ప్రారంభం అవుతున్న దృష్ట్యా బస్సులకు తప్పకుండా సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలి. జిల్లాలో నమోదైన పాఠశాలల బస్సుల యజమానులు వీటిపై దృష్టి సారించాలి. ఏ ఒక్క పత్రం లేకుండా బస్సు రోడ్డెక్కినా చర్యలు తీసుకోవడమే కాకుండా సీజ్ చేస్తాం. జిల్లా వ్యాప్తంగా 274 స్కూల్ బస్సులు ఉండగా, ఇప్పటి వరకు 130 బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ నిర్వహించాం. మిగిలిన వారు వెంటనే ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకోవాలి.

- సాయికృష్ణ, డీటీవో, యాదాద్రి భువనగిరి జిల్లా.

విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం కృషి

సంక్షేమ పథకాల అమలులో అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలి

జడ్పీ సర్వ సభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మందుల సామేలు పక్కన ఎమ్మెల్యే కుంభం

భువనగిరి రూరల్, జూన్ 11: విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేసిందని, పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. మంగళవారం జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయిలయ్య మాట్లాడు తూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేసి సంక్షేమ పథకాలు అర్హులకు అం దించే విధంగా చొరవ చూపాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి మూతపడిన పాఠశాలల ను పునఃప్రారంభించడంతోపాటు ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేస్తున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై ఫిర్యాదులు అందిన పక్షంలో చర్యలు చేపట్టాలని కలెక్టర్ హనుమంతు కే.జెండగేను కోరారు.

- జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి మాట్లాడుతూ 25 రోజుల వ్యవధిలో తమ పదవీ కాలం పూర్తవుతుందని, గత ప్రభుత్వ హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నూతన పాలక వర్గం సభ్యులు కూడా పేదల సంక్షేమానికి కృషి చేయాలన్నారు.
- భువనగిరి, తుంగతుర్తి ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మందుల సామేలు మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.
- జడ్పీ వైస్‌చైర్మన్ ధనావత్ బీకూనాయక్, కాంగ్రెస్ జడ్పీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్, జడ్పీటీసీలు సుబ్బూరు బీరుమల్లయ్య, మాడుగుల ప్రభాకర్‌రెడ్డి, పల్లా వెంకట్‌రెడ్డి, చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, అందించడంతో పాటు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సాగు, తాగునీటి సమస్యలు, రహదారుల మరమ్మతుకు వెంటనే చొరవ చూపాలన్నారు. అదేవిధంగా అసంపూర్తిగా నిలిచిన బునాదిగాని కాల్వ పనుల నిధులు మంజూరుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు కోరారు.
- కలెక్టర్ హనుమంతు కే.జెండగే మాట్లాడుతూ అధికారులందరూ క్షేత్రస్థాయిలో పర్యటించి సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వేగం పెంచాలని, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించి వారి అభ్యున్నతికి చొరవ చూపాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో ఎస్.శోభారాణి, డిప్యూటీ సీఈవో విష్ణువర్ధన్‌రెడ్డి, జడ్పీటీసీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా, జడ్పీ సమావేశానికి ప్రజాప్రతినిధులు వెంట వచ్చిన కార్యకర్తలు సమావేశంలో కూర్చోవడం, తలుపులు, కిటికీలోంచి తొంగి చూస్తుండటంతో కొంత గందరగోళం ఏర్పడింది. సమావేశ మందిరంలో కుర్చీలు లేక అధికారులు బయట వాహనాల షెడ్ కింద కూర్చున్నారు. చివరికి ప్రజాప్రతినిధులు ఇలా వచ్చి అలా మాట్లాడి వెళ్లిపోవడంతో మధ్యాహ్నం అనంతరం నిర్వహించిన సమావేశంలో కుర్చీలు ఖాళీగా కన్పించాయి.



సమావేశంలో కుర్చీలు లేక బయట షెడ్డు కింద కూర్చున్న అధికారులు

డీసీసీబీ అవిశ్వాసంపై ఉత్కంఠ

డీసీసీబీ చైర్మన్‌పై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై రాజకీయవర్గాల్లో ఉత్కంఠ కొనసాగుతోంది. తీర్మానం నెగ్గి చైర్మన్‌ను గద్దెదింపుతామని కాంగ్రెస్ నేతలు ధీమా వ్యక్తం చేస్తుంటే, డైరెక్టర్ల మద్దతు తనకే ఉందని, అవిశ్వాసం వీగిపోతుందని ధీమాలో చైర్మన్ మహేందర్‌రెడ్డి ఉన్నారు. ఈనెల 28న అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరగనుండడంతో నోటీసు ఇచ్చిన డైరెక్టర్లు కాంగ్రెస్‌కు చెందిన డైరెక్టర్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో ప్రత్యేక శిబిరానికి తరలి వెళ్లారు. అవిశ్వాసపు నోటీసు ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్‌లో కొనసాగుతున్న డైరెక్టర్లు సమావేశంలో పాల్గొనరనే విషయంతో అవిశ్వాసంపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

- (ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ)

- ఎవరి ధీమా వారిదే
- అవిశ్వాసం వీగిపోతుందనే నమ్మకంలో గొంగిడి
- నెగ్గి తీరుతామంటోన్న కాంగ్రెస్
- రసవత్తరంగా రాజకీయం



డీసీసీబీ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గాలంటే మూడింట రెండొంతుల మెజార్టీ కావాలి. ప్రస్తుత పాలకవర్గంలో 19 మందికి డైరెక్టర్లకు 14 మంది అవిశ్వాసానికి అనుకూలంగా ఓటేస్తే చైర్మన్ పదవి నుంచి దిగాల్సి ఉంటుంది. అయితే మొత్తం 19మంది డైరెక్టర్లలో చైర్మన్ మహేందర్‌రెడ్డితో పాటు, డైరెక్టర్లు రంగాచారి, అప్పిరెడ్డి, పల్లా ప్రవీణ్‌రెడ్డి ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతుండడంతో పాటు, అవిశ్వాసంపై సంతకాలు చేసిన వారిలో కూడా ఇంకా ఆరుగురు పార్టీ మారలేదని, బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారని,వారు తనకే మద్దతుగా నిలుస్తారనే విశ్వాసాన్ని మహేందర్‌రెడ్డి వ్యక్తం చేస్తున్నారు. అవిశ్వాసం సమావేశంలో వారు ఓటింగ్‌లో పాల్గొనకపోయినా,తీర్మానానికి అనుకూలంగా ఓటేయకపోయినా అవిశ్వాసం వీగిపోతుంది. వైస్ చైర్మన్, డైరెక్టర్లందరి సహకారంతో తాను డీసీసీబీని రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద బ్యాంకుగా తీర్చిదిద్దానని, నిరర్థక ఆస్తులను 11శాతంనుంచి 1.80శాతానికి తగ్గించామని, బ్యాంకు టర్నోవర్ రూ.900 కోట్ల నుంచి రూ.2400 కోట్లకు పెంచామని అంటున్నారు.గతంలో దేవరకొండ కుంభకోణం లాంటి అక్రమాలతో బ్యాంకు ప్రతిష్ఠ దెబ్బతింటే, తమ హయాంలో అలాంటి పొరపాట్లు జరగకుండా ప్రతిష్ఠ పెంచామని, ఈ విషయాలన్నీ డైరెక్టర్లందరికీ తెలుసని, వారందరూ తనకే మద్దతుగా ఉంటారని ఆయన పేర్కొంటున్నారు.

అవిశ్వాసం నెగ్గుతామంటున్న కాంగ్రెస్

ఓ వైపు అవిశ్వాసం వీగుతుందనే ధీమాలో చైర్మన్ మహేందర్‌రెడ్డి వర్గం ఉంటే, మరో వైపు అవిశ్వాసాన్ని నెగ్గుతామని కాంగ్రెస్ డైరెక్టర్లు నమ్మకంగా చెబుతున్నారు. తీర్మానంపై సంతకాలు చేసిన 14 మంది ఏకతాటిపై ఉన్నారని, మహేందర్‌రెడ్డిని గద్దె దింపడం ఖాయమని కాంగ్రెస్ పార్టీ నాయకులు చెబుతున్నారు. అయితే సమావేశం రోజున ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయననే చర్చ సాగుతోంది. సంతకాలు చేసినప్పటికీ వీరిలో ఇంకా బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్న డైరెక్టర్లలో ఒక్కరు ఓటింగ్‌లో పాల్గొనకపోయినా తీర్మానం వీగిపోతుందని, ఆలాంటి పరిస్థితి వస్తే కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా ఉంటుందని పార్టీలో చర్చసాగుతోంది. పార్టీ మారినా, మారకపోయినా అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన డైరెక్టర్లంతా చైర్మన్‌కు వ్యతిరేకంగానే ఉన్నారని, ఆయనకు మద్దతిచ్చే ప్రసక్తే ఉండదని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మొత్తంగా అవిశ్వాస ఘట్టంలో ఇప్పటికీ బీఆర్ఎస్‌లో కొనసాగే డైరెక్టర్లపైనే సర్వత్రా చర్చ నడుస్తుండడంతో, కాంగ్రెస్ ముఖ్యనేతలు ఈ చర్చకు ఫుల్‌స్టాప్ ఎలా పెడతారనే ఆసక్తి రాజకీయవర్గాల్లో సాగుతోంది.

నేటి పాలకవర్గ సమావేశం సాగేనా?

అవిశ్వాస తీర్మాన విషయం ఇలా ఉండగా, మరోవైపు ఇప్పటికే నిర్ణయించిన షెడ్యూల్ మేరకు బుధవారం డీసీసీబీ పాలకవర్గ సమావేశం జరగాల్సి ఉంది. అయితే 14 మంది డైరెక్టర్లు అవిశ్వాస నోటీసు ఇచ్చిన తర్వాత ప్రత్యేక శిబిరానికి తరలివెళ్లిన నేపథ్యంలో ఈ సమావేశం కొనసాగడం ప్రశ్నార్థకంగా కనిపిస్తోంది. వైస్ చైర్మన్ ఇప్పటికే విదేశాల్లో ఉండడంతో, చైర్మన్, మరో ముగ్గురు డైరెక్టర్లు మాత్రమే అందుబాటులో ఉన్నారు. సమావేశం నిర్వహణకు అవసరమైన కోరం సభ్యులు 50శాతం ఉండాలి. అయితే కనీసం 10 మంది డైరెక్టర్లు వస్తేనే సమావేశం జరుగుతుందని, లేకపోతే వాయిదా పడుతుందని అధికారులు చెబుతున్నారు.

అవిశ్వాసం వీగడం ఖాయం



నాపై కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతో ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోవడం ఖాయం. మా హయాంలో బ్యాంకును ఎంతగా వృద్ధిలోకి తీసుకువచ్చామో వైస్ చైర్మన్ సహా డైరెక్టర్లందరికీ తెలిసిందే. వారందరి సహకారంతో బ్యాంకు ప్రతిష్ఠ పెంచాం. అవినీతికి ఆస్కారం లేకుండా పాలన సాగించాం. రాజకీయ లక్ష్యాలతోనే అవిశ్వాసం ప్రవేశపెట్టారు. ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉన్న డైరెక్టర్ల మద్దతు నాకే ఉంది. వారి సహకారంతో తీర్మానం వీగిపోతుందని నమ్ముతున్నా, నేనే చైర్మన్‌గా కొనసాగుతా.

- గొంగిడి మహేందర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్

మోత్కూరు సింగిల్‌విండో చైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాసం నెగ్గడంతో సంబరాలు నిర్వహిస్తున్న డైరెక్టర్లు, కాంగ్రెస్ నాయకులు

- నాటకీయ పరిణామాల మధ్య జరిగిన సమావేశం
- సమావేశానికి ఆలస్యంగా వచ్చిన డీసీవో
- కార్యాలయం ముందు బైఠాయించి డైరెక్టర్ల నిరసన
- కాంగ్రెస్ శ్రేణుల నినాదాలు.. కొంత సేపు తీవ్ర ఉద్రిక్తత

మోత్కూరు, జూన్ 11: మోత్కూరు సింగిల్‌విండో (రైతు సేవా సహకార సంఘం) చైర్మన్ కంచర్ల అశోక్‌రెడ్డిపై వైస్‌చైర్మన్‌తోపాటు తొమ్మిది మంది డైరెక్టర్లు ప్రతిపాదించిన అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా నెగ్గిందని డీసీవో ప్రవీణ్‌కుమార్ తెలిపారు. అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ సమయంలో పలు నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. మంగళవారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించేందుకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చైర్మన్ అశోక్‌రెడ్డిపై అవిశ్వాసం ప్రతిపాదించిన వైస్‌చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లుతోపాటు తొమ్మిది మంది డైరెక్టర్లు క్యాంపు నుంచి నేరుగా సింగిల్ విండో కార్యాలయానికి చేరుకున్నారు. ఓటింగ్ నిర్వహించాల్సిన అధికారి, డీసీవో ప్రవీణ్‌కుమార్ కార్యాలయానికి రాలేదు. దీంతో తొమ్మిది మంది డైరెక్టర్లు కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. సుమారు 11.30గంటల సమయంలో డీసీవో ప్రవీణ్‌కుమార్, చైర్మన్ అశోక్‌రెడ్డి ఒకేసారి రావడంతో వారిద్దరు కుమ్మక్కై వచ్చారంటూ కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఒక దశలో కార్యాలయం వద్ద కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గాలు మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. మొత్తం 13 మంది డైరెక్టర్లకు చైర్మన్‌తోపాటు 10మంది డైరెక్టర్లు సమావేశానికి హాజరయ్యారు. చివరికి డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాసం తీర్మానం నెగ్గింది.

ఆరోపణల్లో వాస్తవం లేదు

డైరెక్టర్లు తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని చైర్మన్ అశోక్‌రెడ్డి అన్నారు. ఈ నెల 18 వరకు అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించకుండా సహకార ట్రిబ్యునల్ స్టే ఇచ్చిందని, అలాంటప్పుడు ఓటింగ్ ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ట్రిబ్యునల్ ఆదేశాలు తనకు అందలేదని డీసీవో చెప్పగా, ఈ నెల 10న ట్రిబ్యునల్ స్టే ఆలస్యం రావడంతో వాట్సాప్‌లో పెట్టారని చైర్మన్ తెలిపారు. అయితే అవి తనకు అందలేదంటూ డీసీవో ప్రవీణ్‌కుమార్ అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా తొమ్మిది మంది డైరెక్టర్లు అనుకూలంగా ఓటు వేశారు. ముగ్గురు డైరెక్టర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్టు డీసీవో ప్రవీణ్‌కుమార్ ప్రకటించారు. ఒక ట్రెండు రోజుల్లో చైర్మన్ ఎన్నికకు తేదీ ప్రకటిస్తామని డీసీవో చెప్పారు. మినిట్స్ రాసే విషయంలో కూడా చైర్మన్, వైస్‌చైర్మన్ మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. సమావేశం ముగిసిన తర్వాత డైరెక్టర్లు, కాంగ్రెస్ వర్గీయులు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో సంబరాలు నిర్వహించారు. రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు నేతృత్వంలో ముగ్గురు ఎస్ఐలు, సివిల్, స్పెషల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

మళ్లీ కోర్టుకు వెళ్తా: అవిశ్వాసంపై ఈ నెల 18 వరకు ఓటింగ్ నిర్వహించకుండా సహకార ట్రిబ్యునల్ స్టే ఇచ్చినప్పటికీ, అధికార పార్టీ ఒత్తిళ్లకు తలొగ్గి డీసీవో ట్రిబ్యునల్ ఆదేశాలను ధిక్కరించి ఓటింగ్ నిర్వహించారని సింగిల్ విండో చైర్మన్ అశోక్‌రెడ్డి ఆరోపించారు. దీనిపై మళ్లీ కోర్టుకు వెళతానన్నారు. ఆయన వెంట పొన్నెబోయిన రమేష్, జంగ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

చేనేత సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా

రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



చేనేత సమస్యలపై చిన్నారెడ్డికి వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

భూదాన్‌పోచంపల్లి, జూన్ 11: తీవ్ర సంక్షోభంలో ఉన్న చేనేత పరిశ్రమ సమస్యలను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, ప్రజాదర్బార్ ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డి అన్నారు. పోచంపల్లికి చెందిన చేనేత నాయకులు మంగళవారం హైదరాబాద్‌లో ప్రజాదర్బార్‌కు వెళ్లి రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు, ప్రజాదర్బార్ ఇన్‌చార్జి డాక్టర్ జి.చిన్నారెడ్డిని కలిసి చేనేత సమస్యలను విన్నవించి వినతిపత్రాన్ని అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత సహకార సంఘాల్లో పేరుకుపోయిన వస్త్ర నిల్వలను ప్రభుత్వం టెస్కో ద్వారా కొనుగోలు చేయాలని, 30 రోజుల్లో డబ్బు చెల్లించేట్టు కృషి చేయాలన్నారు. చేనేత సంఘాలకు పావలా వడ్డీపై క్యాష్ క్రెడిట్ రుణాలను డీసీసీబీ ద్వారా ఇప్పించాలని, 40 శాతం యారన్ సబ్సిడీపై కార్మికులకు నేరుగా అందించాలని కోరారు. జియో ట్యాగ్ ఉన్నవారికి నేరుగా నెలకు రూ.2,500 చెల్లించాలని కోరారు. త్రిఫ్ట్ స్కీము, వయసుతో సంబంధం లేకుండా ఎల్ఐసీ జీవిత బీమా రూ.5లక్షలు వర్తింపజేయాలని కోరారు. టెస్కో షోరూంలను ప్రతీ జిల్లాలో ఏర్పాటు చేయాలని, సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, బతుకమ్మ చీరల తయారీని ఒక్క సిరిసిల్లలోనే కాకుండా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులకు పని అప్పగించాలని కోరారు. అందుకు ఆయన స్పందించి, విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారం కోసం కృషి చేస్తానని చిన్నారెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏలె భిక్షపతి, గంజి కృష్ణ, గంజి బస్వలింగం, తుమ్మ లక్ష్మీనారాయణ, ఏ.భాస్కర్, వి.వెంకటేశం, కె.వెంకటేశం పాల్గొన్నారు.

ఆస్పత్రిలో అక్రమాలపై విచారణ

చౌటుప్పల్ టౌన్, జూన్ 11: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్యకేంద్రంలో రోగుల నుంచి వసూళ్లు చేస్తున్న ఘటనపై డీసీహెచ్ఎస్ డాక్టర్ మాత్రు విచారణ జరిపారు. దీంతో వైద్యులు, సిబ్బందిలో కలవరం మొదలైంది. ఆస్పత్రిలో అక్రమ వసూళ్లతో పాటు ప్రైవేట్ ఆస్పత్రులను నిర్వహిస్తున్న ప్రభుత్వ వైద్యుల వ్యవహారంపై స్టేట్ జాయింట్ యాక్షన్ కమిటీ కన్వీనర్ డాక్టర్ సుధాకర్ వైద్య విధాన పరిషత్ కమిషనర్‌కు ఫిర్యాదుచేశారు. దీంతో మాత్రు నాయక్ విచారణ నిమిత్తం చౌటుప్పల్‌కు వచ్చారు.

సుధాకర్ చేసిన ఫిర్యాదులోని అంశాలు..

- ఆస్పత్రిలో గర్భిణి ప్రసవంకోసం ఆపరేషన్ థియేటర్‌కు తీసుకు వెళ్లేందుకు రూ.1500, కేసీఆర్ కిట్ కోసం రూ.500, జనన నివేదిక సమాచారం కోసం రూ.500 వసూలు చేస్తున్నారు.
- ఆస్పత్రిలో డ్యూటీచేసే డాక్టర్లకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉండడంతో సమయానికి డ్యూటీకి రావడం లేదు.
- బయోమెట్రిక్‌ను వినియోగించకపోవడంతో ఈ ఆస్పత్రి డాక్టర్లు సమయ పాలన పాటించడంలేదు.
- సూపరింటెండెంట్‌తోపాటు కొంతమంది వైద్యులకు ప్రైవేట్ ఆసుపత్రులున్నాయి. కాంట్రాక్టర్‌తో ఔట్ సోర్సింగ్ సిబ్బంది వ్యక్తిగతంగా గొడవలకు దిగుతున్నారు. దీంతో అత్యవసర సేవలను నిలిపి వేసి ధర్నాలు చేస్తుండడంతో రోగుల ప్రాణాలకు ముప్పు వాటిల్లుతోంది.

నివేదికను కమిషనర్‌కు అందజేస్తా : మాత్రునాయక్



మాట్లాడుతున్న మాత్రునాయక్

చౌటుప్పల్ పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగుల నుంచి లంచాలు తీసుకుంటున్నారన్న ఫిర్యాదు మేరకు నిర్వహించిన విచారణ నివేదికను రాష్ట్ర వైద్య, విధాన పరిషత్ కమిషనర్‌కు అందజేస్తామని నల్లగొండ డీసీహెచ్ఎస్ డాక్టర్ మాత్రు తెలిపారు. డాక్టర్ సుధాకర్ చేసిన పలు ఫిర్యాదులపై మంగళవారం ఆరోగ్య కేంద్రంలో మాత్రు విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ అలివేలుపై డాక్టర్ సుధాకర్ పలు రకాల ఫిర్యాదులు చేశారని, అదేవిధంగా ఎఫ్ఎన్‌వో సావిత్రిపై కూడా కొన్ని ఆరోపణలు వచ్చాయన్నారు. విచారణ నివేదికను కమిషనర్‌కు అందజేస్తామన్నారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లీ దళార్చనలు

● యాదగిరీశుడి సన్నిధిలో శాస్త్రోక్తంగా నిత్యపూజలు



నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, జూన్ 11: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో కొలువుదీరిన క్షేత్రపాలకుడు ఆంజనేయస్వామికి మంగళవారం నాగవల్లీ దళార్చనలు, స్వామికి నిత్యపూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. కొండపైన విష్ణుపుష్కరిణి వద్ద ఆంజనేయస్వామికి వేదమంత్రాలతో పంచామృతాభిషేకం చేసిన అర్చకులు సింధూరం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. ఆంజనేయుడికి సహస్రనామ పఠనాలతో నాగవల్లీ దళార్చనలు చేపట్టారు. ప్రధానాలయంలోని ఉత్సవమూర్తులను సుప్రభాత సేవతో మేల్కొలిపి నిజాభిషేకం, నిత్యార్చనలు, ముఖమండపంలో సుదర్శన నారసింహ హోమం, నిత్య తిరుకల్యాణపర్వాలను పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో నిర్వహించారు. కొండపైన అనుబంధ శివాలయంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామికి ముఖ మండపంలోని స్ఫటికమూర్తులకు నిత్య పూజలు, నిత్య రుద్ర హవనం శైవగామ పద్ధతిలో కొనసాగాయి. అనుబంధ పాతగుట్ట ఆలయం, విష్ణుపుష్కరిణి, కొండపైన శివాలయంలోని ఆంజనేయస్వామిని ఆరాధిస్తూ అర్చకులు ప్రత్యేకపూజలు చేశారు. వివిధ విభాగాల ద్వారా రూ. 37,96,361 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఏ. భాస్కర్‌రావు తెలిపారు.

మినీ ఎత్తిపోతలకు ప్రభుత్వం లిఫ్ట్

- నిర్వహణ లోపాలు సరిదిద్దేందుకు మంత్రి ఉత్తమ్ దృష్టి
- నిర్వహణకు సిబ్బంది... నెలాఖరులోగా నియామకాలు
- నాలుగైదు ఎత్తిపోతలకు ఒక సిబ్బంది బృందం
- పైలట్‌గా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లో అమలు
- రాష్ట్రంలోని అన్ని ఎత్తిపోతలను వినియోగంలోకి తేవడమే లక్ష్యం



మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యలపై కోదాడలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి (ఫైల్)



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలంలోని ఎల్-34 ఎత్తిపోతల పథకం

నల్లగొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6.50లక్షల ఎకరాలకు సాగు నీరందించే మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణ లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టిసారించింది. భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఇటీవల ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, రైతులతో కలిసి సమీక్ష నిర్వహించి ఎత్తిపోతల పథకాలు సక్రమంగా నడిచేందుకు తీసుకోవల్సిన చర్యలపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణలో ఎదురవుతున్న లోపాలను సరిచేయడంతోపాటు, ఎత్తిపోతల నిర్వహణకు అవసరమైన సాంకేతిక సిబ్బంది, సాంకేతికేతర సిబ్బందిని నియమించాలని నిర్ణయించారు. నాలుగైదు ఎత్తిపోతల పథకాలకు ఒక సిబ్బంది బృందాన్ని ఏర్పాటు చేయడంతో పాటు, చిన్న చిన్న మరమ్మతులు తలెత్తినప్పుడు వాటిని తక్షణం పరిష్కరించేందుకు అవసరమైన నిధుల కేటాయింపునకు అనుమతి ఇవ్వాలని నిర్ణయించారు.

నిరుపయోగంగా...

కోట్లాది రూపాయల వ్యయంతో మినీ ఎత్తిపోతల పథకాలను నిర్మించినా, వాటిని నడిపేందుకు శిక్షణ పొందిన ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు, ఆపరేటర్లు, పంప్‌హౌస్‌ల వద్ద భద్రతా సిబ్బంది లేకపోవడంతో లిఫ్టులు (మినీ ఎత్తిపోతల పథకాలు) తరచూ మరమ్మతులకు గురవుతున్నాయి. దాదాపు 20 ఏళ్ల క్రితం వరకు వీటిని నిర్మించడం, ఆ తర్వాత వాటి నిర్వహణకు అవసరమైన సిబ్బందిని కూడా రాష్ట్ర నీటిపారుదల సంస్థ చేపట్టేది. ఆ తర్వాత పాలనాపరమైన మార్పులతో ఎత్తిపోతల పథకాలను నిర్వహణను రైతు కమిటీలకు అప్పగించారు. అప్పటినుంచి రైతుల కష్టాలు మొదలయ్యాయి. సాంకేతికపరమైన అవగాహన రైతులకు లేకపోవడం, గ్రామాల్లో అందుబాటులో ఉండే ఎలక్ట్రీషియన్లు, మెకానిక్‌లతో లిఫ్టులను నడుపుతుండడం, అదీ రైతులకు భారంగా మారడంతో మెజార్టీ ఎత్తిపోతల పథకాలు నిరుపయోగంగా మారాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రధానంగా హుజూర్‌నగర్, కోదాడ, మిర్యాలగూడ, నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో నాగార్జునసాగర్ ఎడమకాల్వపైనా, స్థానిక వాగులు, చెరువులపైనా 100కు పైగా మినీ ఎత్తిపోతల పథకాలను నిర్మించారు. ఉమ్మడి జిల్లాలో దాదాపు లక్షన్నర ఎకరాల ఆయకట్టుకు ఈ లిఫ్టులు నీరందించాల్సి ఉంటే, నిర్వహణ లోపంతో వాటిల్లో ఎక్కువభాగం నడవకపోగా, నడిచేవి కూడా అసంపూర్తి ఆయకట్టుకే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో ప్రపంచబ్యాంకు నిధులతో లిఫ్టుల ఆధునికీకరణ చేపట్టినా పూర్తి ప్రయోజనం నెరవేరలేదు. అంతేకాకుండా కాల్వల మరమ్మతులు చేపట్టలేదని, నిర్వహణ సిబ్బందిపై ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఎక్కడవేసిన గొంగడి అనే రీతిలో ఎత్తిపోతల పథకాల పరిస్థితి తయారైంది.

సాంకేతిక సిబ్బంది బృందాల నియామకం

క్షేత్రస్థాయిలో మినీ ఎత్తిపోతల పథకాల నిర్వహణలో ఎదురయ్యే లోపాలను తెలుసుకునేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఇటీవల కోదాడలో నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో కలిసి కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాలకు చెందిన 57ఎత్తిపోతల పథకాల పరిధిలోని రైతులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో వచ్చిన అభిప్రాయాల మేరకు ప్రధానంగా ఎత్తిపోతల పథకాలకు నిర్వహణ సిబ్బందిని నియమించాలని నిర్ణయించారు. రైతు కమిటీలతో సంబంధం లేకుండా ఇరిగేషన్ శాఖ ద్వారానే నాలుగైదు ఎత్తిపోతల పథకాలకు కలిపి ఒక ఆపరేటర్, ఒక ఫిట్టర్, ఒక ఎలక్ట్రీషియన్, మెకానిక్‌ను నియమించాలని నిర్ణయించారు. ఈ బృందంతో పాటు ప్రతి ఎత్తిపోతల వద్ద ఒక వాచ్‌మన్, కాల్వల ద్వారా నీటిని దుర్వినియోగం చేయకుండా సక్రమంగా వినియోగించేలా చూడడంతో పాటు, కాల్వల నిర్వహణను ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అవసరమైన లష్కర్‌లను కూడా నియమించాలని నిర్ణయించారు. ఇప్పటికే ఆయా ఎత్తిపోతల పథకాల వద్ద రైతు కమిటీలు నియమించిన సాంకేతిక సిబ్బందికి నైపుణ్యం ఉంటే వారినే ఈ బృందాల్లో తీసుకోవాలని, లేకపోతే నైపుణ్యం, అర్హత కలిగినవారిని నియమించాలని నిర్ణయించారు. ఇరిగేషన్‌శాఖ ద్వారానే వీరిని ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో కానీ, లేక ఇతర పద్ధతుల్లో నియమించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. రైతు కమిటీలతో సంబంధం లేకుండానే వీరికి నేరుగా ఇరిగేషన్‌శాఖ ద్వారానే వేతనాలు అందించాలనే సూచన కూడా సమావేశంలో వచ్చింది. ఈ నెలాఖరులోగా హుజూర్‌నగర్, కోదాడ నియోజకవర్గాల్లోని 57 ఎత్తిపోతల పథకాలకు తొలుత పైలెట్‌గా ఈ కార్యాచరణ అమలుచేసి లోటుపాట్లను సమీక్షించనున్నారు. త్వరలో రాష్ట్రవ్యాప్తంగా ఇదే రీతిలో అన్నీ మినీ ఎత్తిపోతల పథకాలకు నిర్వహణ సిబ్బంది నియామకం, నిర్వహణకు నిధుల కేటాయింపు చేపడతామని తద్వారా అన్ని మినీ ఎత్తిపోతల పథకాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో
యువకుడి మృతి

- మృతదేహాన్ని ఛత్తీస్‌ఘడ్‌కు తరలించిన కూలీలు



రాంసింగ్ మృతదేహం

హుజూర్‌నగర్, జూన్ 11: ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలు తగిలి ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన యువకుడు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ ఎస్ఐ ముత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. హుజూర్‌నగర్ సమీపంలోని ఎస్ఎస్‌పీ కాల్వ ఆధునీకరణ పనులు చేసేందుకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రం బస్తర్ జిల్లా కూకనర్ గ్రామానికి చెందిన రాంసింగ్ బాగెల్ (25) మంగళవారం ఉదయం 11 గంటలకు వచ్చాడు. ముక్త్యాల బ్రాంచ్ కెనాల్‌లోకి దిగిన రాంసింగ్ అక్కడ అల్యూమినియం మెజర్‌మెంట్స్ స్టాప్‌తో కొలతలు పూర్తిచేసుకుని బయటకు వస్తున్నాడు. ఈక్రమంలో అల్యూమినియం కొలతల పరికరం 11కేవీ విద్యుత్ వైరుకు తగలడంతో రాంసింగ్ విద్యుదాఘాతానికి గురై కిందపడిపోయాడు. దీంతో అక్కడున్న వారు 108లో ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా, మార్గమధ్యంలో మృతి చెందాడు. కాంట్రాక్టర్ బత్తుల నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పొట్ట కూటికోసం తెలంగాణకు వచ్చిన రాంసింగ్ మృతి చెందడంతో తోటి కూలీలు కన్నీటి పర్యంతమయ్యారు. కాగా రామ్‌సింగ్ మృతదేహానికి ఏరియా ఆస్పత్రిలో పోస్ట్‌మార్టం నిర్వహించి ఛత్తీస్‌ఘడ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలి

- చౌటుప్పల్ చేనేత సహకార సంఘం ఎదుట ధర్నా



ఆందోళన నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు, కార్మికులు

చౌటుప్పల్ టౌన్, జూన్ 11: చౌటుప్పల్ చేనేత సహకార సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అఖిల పక్ష కమిటీ నాయకులు డిమాండ్‌చేశారు. పాలకవర్గం అవినీతి, అక్రమాలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం స్థానిక చేనేత సహకార సంఘం ఎదుట అఖిల పక్షం నాయకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ, చేనేత వృత్తిని నమ్ముకొని జీవనం సాగిస్తున్న కార్మికులకు నూతన ఆర్డర్‌ఫాం నమోదు చేయాలని ఎన్నిమార్లు కోరినా పాలకవర్గం పట్టించుకోకుండా పక్షపాతంగా వ్యవహరిస్తోందన్నారు. అదే పాలకవర్గానికి సంబంధించిన వ్యక్తులకు మాత్రం ఏకపక్షంగా ఆర్డర్‌ఫాంలను నమోదుచేసి వాటా ధనాన్ని తీసుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్మికులకు పనులు కల్పించకుండా పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, తమకు అనుకూలమైన కొంతమందికి పనులను కల్పిస్తూ పేద కార్మికులకు అన్యాయం చేస్తోందన్నారు. సంఘానికి చెందిన విలువైన ఆస్తులను విక్రయించేందుకు పాలకవర్గం ప్రయత్నిస్తోందని, సంఘంలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై ప్రశ్నించే కార్మికులను బీఆర్ఎస్‌కు చెందిన సంఘం పర్సన్ ఇన్‌చార్జ్ కందకట్ల భిక్షపతి బెదిరిస్తున్నారని వారు ఆరోపించారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు గోశిక స్వామి, గోశిక రవి, గుర్రం వెంకటేశం, గుర్రం నర్సింహ, వనం ధనుంజయ్య, గోశిక భిక్షపతి, బడుగు కృష్ణ, గోశిక నరహరి, గోశిక బాస్కర్, గోశిక నర్సింహ, గుర్రం మారయ్య, శంకరయ్య, చంద్రయ్య పాల్గొన్నారు.

యాదగిరీశుడి వీఐపీ దర్శనాలకు క్యూలైన్లు

- రూ.26లక్షలతో ప్రతిపాదనలు ● అందుబాటులోకి తాత్కాలిక షెడ్డు ● యాదగిరిగుట్టపై భక్తులకు ఏర్పాట్లు



ఆలయ తూర్పు దిశలో ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్డు

భువనగిరి అర్బన్, జూన్ 11: యాదగిరిగుట్ట లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు వచ్చే వీఐపీ టికెట్ భక్తులకు ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ఇన్నాళ్లు వీఐపీ టికెట్(రూ.150) తీసుకున్న భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శన క్యూలైన్ లేదు. వీరి సంఖ్య కొద్దిగానే ఉండడంతో దర్శనానికి వెంటనే అనుమతించేవారు. దీంతో వీరు తూర్పు రాజగోపురం ఎదురుగా, ప్రాకార మండపం నుంచి ఆలయంలోకి ప్రవేశించేవారు. రానురాను వీఐపీ భక్తుల తాకిడి పెరుగుతుండడంతో వీరికోసం ప్రత్యేకంగా క్యూలైన్ నిర్మాణ పనులు చేపడుతున్నారు. ధర్మదర్శనానికి వచ్చే భక్తులు యాదగిరిగుట్ట కొండపై ఉన్న ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న క్యూకాంప్లెక్స్ ద్వారా తూర్పు రాజగోపురం వద్దకు చేరుకుంటారు. వీఐపీ దర్శన భక్తులు ఉత్తర దిశలోని ప్రాకార మండపం నుంచి తూర్పు రాజగోపురం వద్దకు చేరుకుంటారు. రద్దీ ఎక్కువగా ఉన్నపుడు భక్తులు గుడి బయట వేచి ఉండాల్సి వస్తోంది. దీంతో ఈశాన్య దిక్కు నుంచి తూర్పు రాజగోపురం వరకు షెడ్ల నిర్మించి అందులో క్యూలైన్‌ను ఏర్పాటుచేస్తున్నారు. ధర్మదర్శనం, వీఐపీ దర్శనంలో భక్తులను వేర్వేరు క్యూలైన్లలో ఆలయంలోకి అనుమతిస్తారు.

భక్తుల తాకిడి పెరుగుతుండడంతో..

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర దర్శనానికి రాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. ప్రతీ శుక్ర, శని, ఆది వారాలతోపాటు ప్రత్యేక రోజుల్లో భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. దీంతో కొండపైన తిరువీధులు, ఆలయ పరిసరాలు, బస్టాండ్ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వీరికి ఎండ, వానల నుంచి రక్షణ కోసం ఆలయ అధికారులు ఎప్పటికప్పుడు తగిన ఏర్పాట్లు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. వీటితోపాటు ఒక్కోటి పాత ఆచారాలను కొండపైన తిరిగి ప్రవేశపెట్టేందుకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ తరుణంలో భక్తులకు ఎండ, వాన నుంచి ఉపశమనం, కాసేపు సేద తీరేందుకు ఆలయ ఉత్తరదిశలో భారీ షెడ్డును అధికారులు ఈ సంవత్సరం ఏప్రిల్‌లో అందుబాటులోకి తెచ్చారు. కాగా, ఇన్నేళ్లుగా రూ.150 టికెటు పొందిన వీఐపీ దర్శన భక్తులకు ఇప్పటివరకు ప్రత్యేక దర్శన క్యూలైన్ లేదు. టికెట్ తీసుకున్న వెంటనే ప్రాకార మండపం నుంచి ఆలయంలోకి ప్రవేశించే వారు. అయితే రోజురోజుకూ వీఐపీ భక్తుల రద్దీ కూడా పెరుగుతుండడంతో ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం వీరికోసం తూర్పు రాజగోపురం ఎదురుగా ఎండ, వానల నుంచి రక్షణ కల్పించేందుకు క్యూలైన్లు ఏర్పాటు చేయనుండగా, ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా సాగుతున్నాయి. ఈ షెడ్డు కిందిభాగం నుంచి పాత రేకులు కనిపించకుండా నూతన తెల్లని వస్త్రాన్ని ఏర్పాటు చేశారు. మరోవైపు కంచె ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. ఇదిలా ఉండగా షెడ్డుకు పాత రేకులు బిగించడంతో ఆలయ శోభ తగ్గిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఉత్తర దిశలోని షెడ్డు మాదిరిగా తూర్పు దిశలో కూడా శాశ్వత షెడ్డును అందుబాటులోకి తేనున్నట్లు ఆలయ సివిల్ అధికారులు తెలిపారు. అయితే ప్రస్తుతం వేసిన రేకులు అద్దె ప్రాతిపదికన తెచ్చామని, శాశ్వత షెడ్డు నిర్మాణ పనులు పూర్తి కాగానే వాటిని తొలగిస్తామన్నారు.

రూ.26లక్షలతో ప్రతిపాదనలు

ప్రస్తుతం అందుబాటులోని షెడ్డు సుమారు 72/30 మీటర్ల వైశాల్యంలో ఏర్పాటు చేయగా, శాశ్వత షెడ్డు నిర్మాణం కోసం కమిషనర్ అనుమతికోసం రూ. 26లక్షలతో ప్రతిపాదనలు పంపారు. తాత్కాలిక షెడ్డు పాత ఇనుప రేకులతో ఏర్పాటు చేయగా, ఇక్కడ శాశ్వత దర్శన క్యూలైన్ల కోసం పనులు వేగంగా సాగుతున్నాయి. పనులు పూర్తి కాగానే, మరో నెల రోజుల్లో వీఐపీ దర్శన భక్తులు కొత్తగా ఏర్పాటు చేసిన క్యూలైన్ గుండా ఆలయంలోనికి ప్రవేశించవచ్చు. ఇదిలా ఉంటే తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రేకుల షెడ్డును, శాశ్వత పనుల కోసం నిధులు మంజూరై పనులు ప్రారంభించగానే తొలగించనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ఆలయ శోభకు అడ్డుగా షెడ్డు



పాత రేకులతో ఏర్పాటు చేసిన షెడ్డు ఆలయ శోభకు అడ్డుగా మారింది. అధికసంఖ్యలో క్షేత్ర దర్శనానికి భక్తులు వస్తున్నారు. అదేస్థాయిలో ఆదాయం సమకూరుతుంది. పాత రేకులు ఏర్పాటు చేయడం సరైంది కాదు. తూర్పు రాజగోపురం ద్వారం ఎదురుగా, అలాగే ఉత్తర దిశలో శాశ్వతంగా షెడ్డు ఏర్పాటు చేసినప్పటికీ భక్తులు సేద తీరేందుకు బాగుంది. కానీ, ఆలయ సహజత్వానికి అడ్డుగా మారింది.

వి. శ్రీనివాస్, వరంగల్

టెండర్ ప్రక్రియ పూర్తికాగానే నిర్మిస్తాం



భక్తులకు ఎండ, వానల నుంచి రక్షణకు మాత్రమే అద్దె ప్రాతిపదికన తెచ్చిన పాత రేకులతో షెడ్డును ఏర్పాటు చేశాం. శాశ్వతంగా ఏర్పాటు చేసేందుకు రూ.26లక్షలతో ప్రతిపాదనలు పంపాం. ఇన్ని రోజులు ఎన్నికల కోడ్ ఉన్నందున దేవదాయ శాఖ కమిషనర్ అనుమతికి పంపలేదు. ఎన్నికల కోడ్ ముగిసినందున ప్రతిపాదనలు పంపాం. టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే శాశ్వతంగా షెడ్డు నిర్మాణం చేస్తాం.

● దయాకర్‌రెడ్డి, సివిల్ విభాగం ఈ ఈ, యాదగిరిగుట్ట దేవస్థానం

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.5050
ప్రస్తుత నీటి మట్టం	504.70 అడుగులు
టీఎంసీలు	122.8483
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
సాగర్‌కు నీటి రాక	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	800 క్యూసెక్కులు

- నాగార్జునసాగర్

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	0.90 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	నిల్
నీటి విడుదల	నిల్

- మేళ్లచెర్వు

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	637.30 అడుగులు
టీఎంసీలు	2.57
ఇన్‌ఫ్లో	764 క్యూసెక్కులు
ఔట్‌ఫ్లో	84 క్యూసెక్కులు

- కేతేపల్లి

నిత్యపూజా కైంకర్యాలు



ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు
సుప్రభాత సేవ: ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

చెర్వుగట్టు ఆలయ వేళలు



ఉదయం: 5.00 గంటలకు తెరుస్తారు
సుప్రభాత సేవ మరియు నాదస్వరం: ఉదయం 5.00 నుంచి 5.30 వరకు
నిజాభిషేకం: ఉదయం 5.30నుంచి 6.30గంటల వరకు
దర్శనాలు: ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు
నివేదన: మధ్యాహ్నం 12.00 గంటలకు మహానివేదన
దర్శనం: 12.10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
మూసివేత: మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేత
సాయంత్రం: 3గంటలకు తెరుచుకోనున్న ఆలయం
దర్శనాలు: సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దర్శనాలు
ద్వార బంధనం: సాయంత్రం 7.30 గంటలకు ప్రదోశకాల పూజలు మహా ఫల నివేదన, హారతి అనంతరం ద్వార బంధనం

● నార్కట్‌పల్లి

పత్తి సాగులో మెళకువలు

- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు



త్రిపురారం, జూన్ 11: పత్తి సాగులో పాటించాల్సిన మెళకువలపై కంపసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాసరావు సలహాలు, సూచనలిచ్చారు.

- తొలకరిలో కనీసం 60 మి.మీ వర్షం కురిసిన తర్వాత పత్తి విత్తనాలు విత్తితే భూమిలో వేడి తగ్గి మొలక శాతం బాగుంటుంది.
- వర్షాధారంగా పత్తిని సాగుచేసినప్పుడు జూన్, జూలై నెలల్లో విత్తుకోవచ్చు.
- వర్షాధారంగా జూలై 20 తర్వాత విత్తితే దిగుబడి తగ్గుతుంది. తేలిక నేలల్లో తప్పని సరిగా పత్తిని సాగు చేసినప్పుడు మొక్కల సంఖ్య మాములు కంటే ఎక్కువగా ఉండేట్లు దగ్గరగా విత్తుకోవాలి.
- ప్రాంతీయ పత్తి పరిశోధన సంస్థ నాగపూర్, మహారాష్ట్ర వారు రూపొందించిన అధిక సాంద్రత పత్తిలో లాభసాటిగా ఉందని రైతులు చెబుతున్నారు. ఈ అధిక సాంద్రత పత్తిలో మొక్కకు మొక్కకు మధ్య 15 సెం.మీ సాళ్ళ మధ్య 90 సెం.మీ దూరంలో మొక్కలను నాటుకోవటం ద్వారా మొక్కల సాంద్రత సాధారణ పద్ధతి కంటే 2-3 రెట్లు పెరుగుతుంది. అదేవిధంగా దిగుబడి 12 నుంచి 14 క్వింటాళ్లు ఎకరాకు వస్తుంది.

15న పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష

నల్లగొండ, జూన్ 11: మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష ఈ నెల 15న ఆర్ట్స్ కళాశాల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కళాశాల అడ్మిషన్ డైరెక్టర్ ఆచార్య ఆకుల రవి ఒక ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరిలో దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, పరీక్షకు రావాలన్నారు.

నేడు, రేపు ధ్రువపత్రాల పరిశీలన

జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో భాగంగా బుధ, గురువారాల్లో వైద్య ధ్రువపత్రాలను పరిశీలించనున్నట్లు డీఈవో భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రిఫరెన్షియల్ కేటగిరీలో ఎంటైటిల్మెంట్ పాయింట్స్ పొందడానికి వైద్య ధ్రువపత్రాలను తమ మెడికల్ రిపోర్టుతో హాజరుకావాలని తెలిపారు. జిల్లా మెడికల్ బోర్డు రెండు రోజులపాటు వైద్య పరిశీలన నిర్వహిస్తున్నందున సమయానికి హాజరు కావాలన్నారు.

పదోన్నతుల కౌన్సిలింగ్‌కు..

జిల్లాలోని పలు పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ), సమాంతర కేడర్‌లో పనిచేస్తున్న స్పెషల్ ఎడ్యుకేషన్(స్పెషల్ బీఈడీ) చేసిన ఉపాధ్యాయుల పదోన్నతుల కౌన్సిలింగ్‌కు సంబంధించి బుధవారం అర్హత సర్టిఫికెట్లు పరిశీలించనున్నారు. ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లతోపాటు సర్వీస్ పుస్తకాలతో ఉదయం 10గంటలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో హాజరు కావాలని సూచించారు.

16న విశ్వబ్రాహ్మణ సత్ర కమిటీ ఎన్నిక

మఠంపల్లి, జూన్ 11: సూర్యాపేట జిల్లా మట్టపల్లి మహాక్షేత్రంలోని విశ్వబ్రాహ్మణ నిత్యాన్నదాన సత్ర కమిటీ ఎన్నిక ఈ నెల 16న నిర్వహించనున్నట్లు సంఘం అధ్యక్షుడు ఉడ్డోజు సూర్యనారాయణాచారి అన్నారు. మంగళవారం మట్టపల్లి క్షేత్రంలో జరిగిన సత్ర కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

వంట కార్మికులకు రూ.10 వేలు ఇవ్వాలి



కలెక్టరేట్‌లో ఏవో జగన్మోహన్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇమ్రాన్, వంట కార్మికులు

భువనగిరి అర్బన్, జూన్ 11 : మధ్యాహ్న భోజన కార్మికులకు బకాయిల విడుదలతో పాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన రూ.10 వేల వేతనం హామీని కూడా అమలు చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎండీ ఇమ్రాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో ఏవో సీ జగన్మోహన్, డీఈవో కార్యాలయ ఏడీ ప్రశాంత్‌రెడ్డిలకు మంగళవారం వినతిపత్రం అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కోడిగుడ్లు, వంట గ్యాస్, నాణ్యమైన బియ్యాన్ని పాఠశాలలకు పంపేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించవద్దని, అకారణంగా కార్మికులకు తొలగించవద్దని, ప్రమాద బీమా పథకం వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సామల శోభన్‌బాబు, వంట కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాగుల వసంత, ముంతాజ్‌బేగం, సంధ్య, నిర్మల, లక్ష్మీ, అనసూర్య, వాణి, అండాలు, కృష్ణవేణి, సుగుణ తదితరులు పాల్గొన్నారు.

నగదు బదిలీపై స్పష్టమైన హామీ ఇవ్వాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జీఎంపీఎస్ నాయకులు

భువనగిరి రూరల్, జూన్ 11: నగదు బదిలీపై స్పష్టమైన హామీ ఇవ్వాలని గొర్రెల, మేకల పెంపకదారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా కార్యదర్శి మద్దెపురం రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జడ్పీ కార్యాలయ ఆవరణలో కలెక్టర్ హన్మంతు కే జెండగేకు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం యధావిధిగా కొనసాగిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించి ఆరునెలలు గడుస్తున్నా ఇంతవరకూ లబ్ధిదారులకు పంపిణీ చేయలేదన్నారు. నగదు బదిలీపై స్పష్టమైన హామీ ఇవ్వకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ, నాయకులు ర్యాకల శ్రీనివాస్, బుడమ శ్రీశైలం, సత్యనారాయణ, జహంగీర్, మల్లేష్, రాజలింగం, యాదగిరి పాల్గొన్నారు.

పెట్టుబడి సాయాన్ని వెంటనే అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ

భూదాన్‌పోచంపల్లి, జూన్ 11 : వానాకాలం మొదలైనందున రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ కోరారు. మంగళవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల, పట్టణ కమిటీ సంయుక్త సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 15, 16 తేదీల్లో భువనగిరి పట్టణంలో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతమైన పోచంపల్లి మండలంతో పాటు జిల్లాలో 99 శాతం మంది దొడ్డురకం ధాన్యాన్ని సాగు చేస్తారని, ప్రభుత్వ సన్నరకాలకే బోనస్ ఇస్తామనడం సరికాదన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో రైతులకు సబ్సిడీపై అన్నిరకాల విత్తనాలు అందించాలన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పగిళ్ల లింగారెడ్డి, పట్టణ కార్యదర్శి కోడె బాలనర్సింహ, మండల కార్యదర్శివర్గ సభ్యుడు కోట రామచంద్రారెడ్డి, మంచాల మధు, మండల, పట్టణ కమిటీ సభ్యుడు నెలకంటి జంగయ్య, నోముల కృష్ణారెడ్డి, కల్యాకరి భిక్షపతి, గూడూరు కృష్ణారెడ్డి, గూడూరు రాంరెడ్డి, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



ప్రకాశ్‌ను సన్మానిస్తున్న సాయిబాబ

భువనగిరి రూరల్, జూన్ 11 : విద్యుత్ కార్మికులు ఎదుర్కొంటున్న 52 సమస్యలను పరిష్కరించాలని యజమాన్యానికి విజ్ఞప్తి చేసినా పరిష్కారం కాలేదని తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ సాయిబాబు అన్నారు. మంగళవారం భువనగిరిలో తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఫోర్‌మన్ పీ ప్రకాశ్ పదవీ విరమణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాత్రీపగలు కార్మికులు ఎంతో ఒత్తిడితో విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు సేవలు అందిస్తున్నా ఐదేళ్ల నుంచి ప్రమోషన్లు లేకుండా అవస్థలు పడుతున్నారన్నారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికులకు రూ.కోటి ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డిస్కం కంపెనీ అధ్యక్షుడు ఏ వేణు, ఎన్ వెంకన్న, జనార్ధన్ రెడ్డి, ఎస్‌సీ శ్రీనాథ్, డీఈలు మల్లికార్జున్, విజయభాస్కర్‌రెడ్డి, యూనియన్ అధ్యక్షుడు పీ యాదగిరి, అమర్‌నాథ్, గోపాల్, సురేందర్‌రెడ్డి, మీర్జా షకీల్‌బెగ్, టీ రమేష్‌రెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, సోమేశ్వర్‌రెడ్డి, బాబుగౌడ్, శ్రీకాంత్, అనిల్, భాస్కర్, నాగరాజు, ఉమ, స్వరూప, సోమమ్మ, స్వాతి పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వలిగొండ: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ రమేష్‌రాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జితేందర్ రెడ్డి తెలిపారు.

చినుకు.. చిరాకు

- బీబీనగర్‌లో భారీ వర్షం
- వలిగొండలో మోస్తరు



బీబీనగర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిలిచిన వర్షపు నీరు

బీబీనగర్, వలిగొండ, జూన్ 11 : జిల్లాలో మంగళవారం భారీ వర్షం కురిసింది. బీబీనగర్ మండల కేంద్రంలో భారీగా, వలిగొండలో మోస్తరు వర్షం పడింది. బీబీనగర్‌లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రైల్వేఫ్లైఓవర్ బ్రిడ్జిపై కురిసిన నీరంతా దిగువనున్న పీహెచ్‌సీ రహదారి బంగ్లా, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోకి చేరింది. దీంతో మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు అడుగుల మేర నీళ్లు చేరాయి. దీంతో కార్యాలయ సిబ్బంది ఇబ్బందులుపడ్డారు. అలాగే గోకుల్‌నగర్, ఎంప్లాయిస్ కాలనీ, లక్ష్మీనగర్ కాలనీలు జలమయమయ్యాయి. బైపాస్ రోడ్డులోని అండర్ ప్రొసింగ్, ఆర్వో బ్రిడ్జి టర్నింగ్ వద్ద మూడు అడుగుల మేర నీరు నిలిచిపోవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. అదేవిధంగా వలిగొండ మండలకేంద్రంలో సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వర్షం పడటంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు.



భూదాన్‌పోచంపల్లి, జూన్ 11 : చిన్న వర్షానికే రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. సోమవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికి పట్టణంలోని 13వ వార్డులోని రోడ్లపై వర్షపు నీరు నిలిచి చెరువును తలపిస్తోంది. మంగళవారం స్థానికులు ఈ రహదారిపై నిలిచిఉన్న నీటిలో చేపలు పడుతూ తమ నిరసన వ్యక్తం చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ చిట్టిపోలు విజయలక్ష్మి ప్రాతినిధ్యం వహిస్తున్న 13వ వార్డులోని రోడ్డు దుస్థితిపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రహదారికి మరమ్మతులు చేపట్టి సమస్యను పరిష్కరించాల్సిందిగా స్థానిక నాయకులు చింతకింది కిరణ్ కోరుతున్నారు.

భువనగిరి మునిసిపాలిటీకి అమృత్ నిధులు



హెచ్‌బీకాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి టౌన్, జూన్ 11 : అమృత్ 2.0 పథకంలో భాగంగా భువనగిరి మునిసిపాలిటీకి రూ.28.80 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. అమృత్ నిధులను తాగునీటి అవసరాల కోసం వినియోగించనున్నట్లు తెలిపారు. ఈ మేరకు నిర్మించాల్సిన వాటర్ ట్యాంకులకు స్థల పరిశీలన చేశారు. నిధుల వినియోగంపై అధికారులతో సమీక్షించారు. అర్బన్‌కాలనీలో రూ.24 లక్షలతో నిర్మిస్తున్న రైల్వే అండర్‌పాస్ కాల్వ పనులకు శంకుస్థాపన చేశారు. అర్బన్‌కాలనీ వాసుల రవాణా కష్టాలు తీరుస్తామన్నారు. హెచ్‌బీ కాలనీలో పర్యటించి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలకు శాశ్వతంగా పరిష్కరిస్తామన్నారు. అసంపూర్తి పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మునిసిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కమిషనర్ రామాంజులరెడ్డి, కౌన్సిలర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, ఈరపాక నర్సింహ, డీఈఈ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ నెల 17న బక్రీద్ పండుగను పురస్కరించుకుని ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేయించాలని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డిని మైనార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఇక్బాల్ చౌదరి, అమీన్ మైమన్, ఫారూఖీ, అవేజ్‌చిస్తీ, ఇంతిహాజ్, రఫీఒద్దీన్ గౌరి, మజహర్, హమీద్ పాల్గొన్నారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లలోకి గృహ ప్రవేశాలు చేసేందుకు మౌలిక వసతులు కల్పించాలని లబ్ధిదారులు ఎమ్మెల్యేను కోరారు.

నిధులు మంజూరు చేయండి

భువనగిరి రూరల్: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షురాలు గునుగుంట్ల కల్పనశ్రీనివాస్‌గౌడ్ వినతిపత్రం అందజేశారు.అనాజిపురం, రెడ్డినాయక్‌తండా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలన్నారు.

దీర్ఘకాలిక సమస్యలపై ప్రత్యేక దృష్టి

బీబీనగర్ : నియోజకవర్గంలో దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణ లక్ష్మి లబ్ధిదారులకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బునాదిగాని, పిలాయిపల్లి, మూసీ కాల్వల విస్తరణతో పాటు నదుల పరివాహక ప్రాంతాల్లో బ్రిడ్జిల నిర్మాణాలకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సుధాకర్‌గౌడ్, జడ్పీటీసీ గోళి ప్రణీతపింగల్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీధర్, ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ గణేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ మెట్టు శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ గడ్డం బాలకృష్ణగౌడ్, ఎంపీటీసీలు పంజాల రామాంజనేయులు గౌడ్, నరేందర్‌రెడ్డి, టంటం భార్గవ్, నాయకులు పొట్టోళ్ల శ్యాంగౌడ్, సురకంటి సత్తిరెడ్డి, మల్లగారి శ్రీనివాస్‌గుప్తా, మహేశ్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్, లక్ష్మయ్య, ఆగమయ్య గౌడ్, బస్వయ్య, రఘునందన్‌గౌడ్, ఎండీ మొహిన్, నరేందర్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

భూదాన్‌పోచంపల్లి: ప్రజాసమస్యల సత్వర పరిష్కారమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇంద్రియాల గ్రామానికి చెందిన పార్టీ నాయకులు బస్సు సౌకర్యం మెరుగుపర్చాలని కోరుతూ ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు చింతల శ్రీశైలం, నాయకులు రాజేశ్వర్, జంగారెడ్డి, యాదగిరి, శ్రీహరి, మహిపాల్‌నాయక్, బీ గణేష్, డీ శ్రీనివాస్, లింగారెడ్డి, సాయిరాంరెడ్డి పాల్గొన్నారు.

దాడిని ఖండిస్తూ నల్లబ్యాడ్జీలతో ఫొటోగ్రాఫర్ల నిరసన



చౌటుప్పల్‌లో నినాదాలు చేస్తున్న ఫొటోగ్రాఫర్లు

చౌటుప్పల్ టౌన్, జూన్ 11 : శుభకార్యానికి ఆర్డర్‌పై వెళ్లిన ఫొటోగ్రాఫర్ సెల్‌ఫోన్‌లో ఫొటో తీయలేదని సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకలో ఫొటోగ్రాఫర్ లింగస్వామిపై బంధువుల దాడిని నిరసిస్తూ మంగళవారం జిల్లాలో పలుచోట్ల ఫొటోగ్రాఫర్లు నిరసన వ్యక్తం చేశారు. దాడిచేసిన వారిని శిక్షించాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్‌లో ర్యాలీ అనంతరం నల్లబ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు తొర్పునూరి సాయిలుగౌడ్, ప్రతినిధులు మెట్టు రామచంద్రారెడ్డి, కందకట్ల కృష్ణ, దేశగోని రాజు, బొడిగే ప్రభాకర్, చంద్రశేఖర్, గణేష్, కాటం రాజు, రుషి, రాఘవేంద్ర, ప్రవీణ్, బలరాం, మహేష్, మధు, శంకర్, మధవాచారి, నిశాంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

మోత్కూరు: స్థానిక అంబేడ్కర్ చౌరస్తాలో ఫొటోగ్రాఫర్ల నిరసనలో సంఘం మండల అధ్యక్షుడు చీమల వీరస్వామి, గుండు శ్రీనివాస్, గొడిశాల రాజయ్య, కోమటి జనార్దన్, కూరెల్ల విష్ణు, ఎడ్ల ప్రవీణ్, రాజశేఖర్, మహేష్, ప్రశాంత్, శేఖరాచారి పాల్గొన్నారు.

మోటకొండూరు : స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద నల్లబ్యాడ్జీలతో ఫొటోగ్రాఫర్లు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు లోడె చంద్రశేఖర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు తిరుమల్, ప్రధానకార్యదర్శి మానెగళ్ల విక్రమ్, అద్దమడుగు నాగరాజు, భూమండ్ల శివకుమార్, బొజ్జ శంకర్, మానెగళ్ల శశి పాల్గొన్నారు.

భూదాన్‌పోచంపల్లి : పోచంపల్లిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు బోగ చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి మక్తాల కృష్ణ, ఉపాధ్యక్షులు సీత శ్రవణ్, కేమ విష్ణు, ప్రతినిధులు రాయబండి వెంకటాచారి, గోదాసు శేఖర్, దొడ్డమోని వంశీధర్, చెక్క మల్లేష్, దోర్నాల నందు, కృష్ణానందం, పెండెం బాలలింగం, దోర్నాల రత్నం, గంజి రాజేష్ పాల్గొన్నారు.

డీలర్ల వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలి



అడ్డగూడూరులోని ఎరువుల దుకాణంలో విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఆత్మకూర్(ఎం) / అడ్డగూడూరు, జూన్ 11 : లైసెన్స్ ఉన్న డీలర్ల వద్దే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని జిల్లా అంతర్గత విత్తన టీం, ఏడీఏ పద్మావతి రైతులకు సూచించారు. ఆత్మకూర్(ఎం)లోని ఎరువుల దుకాణాలను టీం సభ్యులు మంగళవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎరువులు, విత్తనాలు, మందుల నిల్వలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ పద్మావతీ మాట్లాడుతూ హెచ్‌టీతో పాటు విడిగా పత్తి విత్తనాలను విక్రయించవద్దన్నారు. తనిఖీల్లో టీం సభ్యులు దుర్గేశ్వరి, సుజాత ఉన్నారు. అదేవిధంగా అడ్డగూడూరులోని ఎరువులు, మందుల తుకాణాల్లోనూ అధికారుల బృందం తనిఖీలు చేపట్టింది. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అరుణకుమారితో పాటు తుర్కపల్లి మండల అధికారి దుర్గేశ్వరి, వలిగొండ ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రికి కుమార్తె తలకొరివి



తండ్రి అంతిమయాత్రలో ముందు నడుస్తున్న కుమార్తె

రామన్నపేట, జూన్ 11 : బోగారం గ్రామంలో తండ్రికి తనయురాలు తలకొరివి పెట్టింది. గ్రామానికి చెందిన ఆర్ఎస్ఎస్ కార్యకర్త కూనూరు సుదర్శన్ మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు కుమారులు లేకపోవడంతో కుమార్తె భాగ్య తండ్రికి తలకొరివి పెట్టింది. సుదర్శన్ అంత్యక్రియలకు బోగారం మాజీ సర్పంచ్ అంతటి పద్మారమేష్‌గౌడ్, బీజేపీ గ్రామశాఖ ఆధ్వర్యంలో, కాంగ్రెస్ నాయకులు కూనూరు సాయికుమార్‌గౌడ్ రూ.10 వేల చొప్పున అందజేశారు. అదేవిధంగా గోశిక వెంకటేశ్వర్లు, ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో, కన్నెకంటి వెంకటేశ్వర్లు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య



కరపత్రం విడుదల చేస్తున్న చైర్‌పర్సన్ కవిత

మోత్కూరు, జూన్ 11 : ప్రభుత్వ జూనియర్ కళాశాల్లోనే ఉచిత విద్యతో పాటు, నాణ్యమైన విద్య అందుతోందని మోత్కూరు మునిసిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితా లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో ముద్రించిన ప్రచార కరపత్రాలను విడుదల చేసి, లెక్చరర్లు నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో మాట్లాడారు. విద్యార్థులకు ప్రభుత్వం పాఠ్యపుస్తకాలు, స్టడీ మెటీరియల్ అందిస్తోందని, అనుభవం కలిగిన అధ్యాపకులతో విద్యాబోధన జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రభజస్టిస్, కళాశాల లెక్చరర్లు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

ఆత్మకూరు(ఎం) జూన్ 11: మండలంలోని ఖప్రాయిపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి చెందింది. గ్రామానికి చెందిన రైతు బండ సాయికి చెందిన పాడిగేదె మంగళవారం మేతకు తీసుకెళ్లగా పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనతో రూ.లక్ష నష్టం వాటిల్లిందని ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరారు.

జడ్పీ సమావేశ మందిరంలో ఇతరులు.. బయట అధికారులు

ఆంధ్రజ్యోతి క్లిక్



జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జడ్పీ సమావేశ నిర్వాహణ లోపాలు స్పష్టంగా కనిపించాయి. ప్రజాప్రతినిధుల వెంట వచ్చిన వాళ్లు సమావేశ మందిరంలో కూర్చోవడంతో అధికారులు ఆరుబయటకు పరిమితమ య్యారు. దర్వాజ, కిటికీల వద్ద పెద్దసంఖ్యలో కార్యకర్తలు నిల్చున్నారు. 25 రోజుల్లో ప్రజాప్రతినిధుల పదవీకాలం ముగుస్తుండటంతో ఉదయం, మధ్యాహ్నం సమావేశాలు నిర్వహించారు. అయితే ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు మధ్యాహ్న సమావేశానికి హాజరుకాలేదు.



చౌటుప్పల్ టౌన్: అక్రమంగా పాఠ్యపుస్తకాలను విక్రయిస్తూ, అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పల్లె శివకుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో శేఖర్ రెడ్డికి పత్రం అందజేశారు.

భువనగిరి రూరల్ : రాయగిరి రైల్వేస్టేషన్ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆర్డీవో పరాంకుశం అమరేందర్ దంపతులు ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని దర్శించారు.

బీబీనగర్: నెమురగొముల గ్రామానికి చెందిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ సంకూరి శ్రీకాంత్ కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని ఢిల్లీలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రత్యేకంగా తయారు చేయించిన పెన్నును బహూకరించారు.

వలిగొండ : రాష్ట్రంలో సమగ్ర కులగణనను నిర్వహించాలని శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షులు పుట్ట వీరేశ్ యాదవ్‌గౌడ, అతికం లక్ష్మీనారాయణగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈ నెల 15న ఇందిరాపార్కు వద్ద నిర్వహించ తలపెట్టిన బీసీ జన సభ మహా ధర్నా పోస్టర్‌ను మండలకేంద్రంలో ఆవిష్కరించారు.

మోత్కూరు: పాటిమట్ల గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు మెతుకు రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. ఆ పార్టీ నాయకుడు బొల్లు యాదగిరి నివాళులర్పించారు.

ఆత్మకూరు(ఎం): మండలకేంద్రానికి చెందిన రోజు కూలి వనం సుగుణమ్మ గుండెపోటుతో వారం క్రితం మృతి చెందింది. ఆమె కుమారుడు నవీన్‌తో చదువుకున్న పదో తరగతి పూర్వవిద్యార్థులు తమసహాయంగా రూ.20 వేల అందజేశారు.

గుండాల: మండలకేంద్రానికి చెందిన కూడూరు మల్లేశ్ ఇటీవల మృతి చెందడంతో అతడి కుటుంబానికి 10వ తరగతి 1998-99 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

మోత్కూరు: మోత్కూరు పరిధిలోని అన్నెపువాడలో కొన్నేళ్లుగా ప్రభుత్వ భూమిలో ఉన్న బోరు, వాటర్ ట్యాంకు తొలగించిన వారిపై చర్య తీసుకోవాలని కోరుతూ కాలనీవాసులు కమిషనర్ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. విచారణ జరిపి చర్య తీసుకుంటానని కమిషనర్ హామీ ఇచ్చారు.

మోత్కూరు: మోత్కూరు పరిధిలోని అనారోగ్యంతో బాధపడుతున్న గడిబజారుకు చెందిన నిలిగొండ రేణుకకు వైద్యఖర్చుల కోసం యూత్ సభ్యులు రూ.11వేలు అందజేశారు.

ఆలేరు రూరల్ : రైలు ప్రమాదంలో కాలు కోల్పోయి వరంగల్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ఆలేరుకు చెందిన మునిసిపల్ కార్మికుడు సాయిని ఆలేరు మాజీ సర్పంచ్, మాజీ ప్రజాప్రతినిధుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఆకవరం మోహన్‌రావు పరామర్శించారు. సాయికి మనోధైర్యాన్ని కల్పించి త్వరగా కోలుకోవాలన్నారు. ఆయన వెంట దూడం మధు ఉన్నారు.

శ్మశానవాటికను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తుర్కపల్లి, జూన్ 11 : మండలంలోని గోపాలాపురం గ్రామంలో శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి సిలివేరు దుర్గయ్య అధికారులను డిమాండ్ చేశాడు. శ్మశానవాటిక స్థలం ఆక్రమణపై గ్రామస్థులతో కలిసి పార్టీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేనెంబరు 227లోని శ్మశానవాటిక స్థలాన్ని, మండలంలోని ముల్కలపల్లి గ్రామంలోని సర్వేనెంబరు 33లోని అసైన్డ్ భూమిని కొందరు కబ్జా కబ్జా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. ఈ మేరకు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.కార్యక్రమంలో దాసారం స్వామి, కనకయ్య, మల్లెబోయిన రాజు, కూర యాదగిరి, కరుణాకర్, చంద్రయ్య, అంబదాసు పాల్గొన్నారు.

పేదరికంతో చదువుకు దూరం కావొద్దు

సంస్థాన్ నారాయణపురం, జూన్ 11: పేదరికంతో ఏ విద్యార్థి చదువుకు దూరం కావొద్దని కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ అన్నారు. మండలంలోని లచ్చమ్మగూడెంలో రూ.4.80లక్షలతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీ చరణ్ మాట్లాడుతూ విద్యారంగాన్ని సేవా రంగంగా ఎంచుకొని ఏడేళ్లుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కేంద్రంలోని పిల్లలకు ఆటవస్తువులు, గ్యాస్‌స్టవ్, పప్పు, కుక్కర్, బాలింతల కోసం చైర్లు, ఇతర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జే అలివేలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శ్రీలత, నిరూప, సాగర్ల లింగయ్య, జే జగన్, జక్కలి రాజు, ముత్తయ్య, జక్కలి విక్రమ్, బోనగిరి దేవేందర్‌మహేష్, నవీన్‌రెడ్డి, వీరమళ్ల కార్తీక్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కస్తూరి శ్రీచరణ్ జన్మదిన వేడుకలు

మండలకేంద్రంలో మంగళవారం కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ జన్మదిన వేడుకలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. చైర్మన్ శ్రీచరణ్‌ను గజమాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో సభ్యులు సభ్యులు వీరమల్ల కార్తీకగౌడ్, పొట్ట సత్యం, గంగపురం సాయి,కొప్పు రామకృష్ణ, సూరేపల్లి శివాజీ, కస్తూరి నరేందర్‌రెడ్డి, రాచకొండ రమేష్, సిలివేరు సైదులు, బైకాని నరేందర్, ఆత్మార్ గిరి, వెలిజాల శ్రీను పాల్గొన్నారు.